# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

వైఎస్ఆర్ కడప / అన్నమయ్య

07 ఆదివారం, జులై 2024 | పేజీలు: 08


### అందరి సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తాం

## నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన శివశంకర్ లోతేటి



కడప కలెక్టరేట్ మేజర్‌న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారుల సమన్వయ సహకారంతో, జిల్లా ప్రజల అభిమానంతో జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు నడిపించేందుకు కృషి చేస్తామని.. వైఎస్ ఆర్ జిల్లా నూతన కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయన.. కలెక్టర్ ఛాంబర్‌లో వేద పండితులు ఆశీర్వచనాలు అందించగా.. ఉదయం 11 గంటల సమయంలో వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజలు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల సహకారంతో కలెక్టర్‌గా కర్తవ్య నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నెరవేరుస్తూ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శవం

## ఆడా ఉంటాం.. ఈడా ఉంటాం...

### అవకాశవాదమే రాజకీయానికి పునాది..
### ఎక్కడ అధికారం ఉంటే అక్కడ వాలిపోతాం,,,
### వైసిపి నుండి టిడిపిలోకి జంపింగ్ రెడ్డీ



4 లో

అన్నమయ్య జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్: ముందు వచ్చిన చెవుల కంటే వెనక్కి వచ్చిన కొమ్ములు వాడి అనే సామెత లాగా, గత ఐదు సంవత్సరాలుగా కష్టపడి పార్టీ కోసం పని చేస్తూ, అప్పటి వైకాపా ప్రభుత్వం చేత అనేక ఇబ్బందులు పడ్డ టిడిపి కార్యకర్తలు నాయకుల కంటే ప్రస్తుతం వైకాపా అధికారంలో ఉండగా గెలుపు సొంతం చేసుకున్న నాయకులను టిడిపిలోకి ఆహ్వానించి వైకాపాన మానసికంగా దెబ్బతీయాలని కొందరు టిడిపి నేతలు చేస్తున్న ప్రయత్నాలు వైకాపాను మానసికంగా దెబ్బతీస్తాయో లేదో తెలియదు కానీ వారి చేత అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న టిడిపి నాయకులు కార్యకర్తలు గుండెల్లో మాత్రం గుణపాలు దిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇప్పటికే చిత్తూరు జిల్లాలో అనేకమంది చైర్మన్లు మెంబర్లు టిడిపి తీర్థం పుచ్చుకోవడంతో అదే



# ఘోర రోడ్డు ప్రమాదం

## కారు లారీ ఢీ

## నలుగురు మృతి

### ఒకరికి తీవ్ర గాయాలు

రామాపురం,మేజర్ న్యూస్ : అన్నమయ్య జిల్లా రామాపురం మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి.కడపకు చెందిన అఫ్రోజ్ ఖాన్ కారును కొనుగోలు చేసి బాడుగులకు తిప్పుకుంటూ జీవనం సాగించాలన్న ఉద్దేశ్యంతో కర్నాకటలో కారును కొనుగోలు చేసి రాత్రి కడప నుంచి రాయచోటికి వారు ప్రయాణిస్తున్న ఇతియోస్ కారు అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో మార్గమధ్యంలోని చిట్లూరు హరిజనవాడ సమీపంలో ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది.. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న అఫ్రోజ్, అలీమ్ జితేంద్ర, అంజి నాయక్‌లు అక్కడికక్కడే మృతిచెందారు. మృతులంతా 35 సంవత్సరాల లోపు వారు. ఖాదర్ బాషా అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితులందరూ కడపకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. మృతుడు అంజి నాయక్ కమలాపురం పోలీస్ స్టేషన్ లో పోలీసు హెూంగార్డుగా పనిచేస్తున్నాడుని లక్కిరెడ్డిపల్లి సీఐ గంగానాధ బాబు తెలిపారు.



జరిగిన సంఘటన పై రామపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు లక్కిరెడ్డిపల్లి సీఐ గంగానాద బాబు వెల్లడించారు.

## 53ఎర్రచందనం దుంగలు స్వాధీనం

### మోటారు సైకిల్ తో పాటు ముగ్గురు స్మగ్లర్లు అరెస్టు



ఖాజీపేట మేజర్‌న్యూస్: టాస్క్ ఫోర్స్ ఇన్చార్జి తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఐపీఎస్ ఆదేశాలంధరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కడప సబ్ కంట్రోల్ కు చెందిన ఆర్.ఎస్.ఐ పి. నరేష్ టీం శుక్రవారం రాత్రి పొద్దుటూరు రేంజ్ పరిధి లోని ఖాజీపేట ఫారెస్ట్ డివిజన్ నుంచి కొంబింగ్ చేపట్టారు వీరు శనివారం తెల్లవారుజామున నాగసానిపల్లి రేంజ్ లో పోతా భక్తుని భావి ప్రాంతం చేరుకునే సరికి కొందరు వ్యక్తులు మోటార్ సైకిల్ తో అనుమానాస్పదంగా కనిపించారు నుంచి వీరిని సమీపించే సరికి వీరు పారిపోయే ప్రయత్నం చేశారు. అయితే టాస్క్ ఫోర్సు పోలీసులు ముగ్గురిని పట్టుకోగలిగారు. వీరిని విచారించగా కొన్ని ఎర్రచందనం దుంగలను కూలీల ద్వారా సేకరించామని, వాటిని రవాణా చేయడానికి సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. దుంగలు దాచి ఉంచిన ప్రదేశంలో చూడగా, అక్కడ 53ఎర్రచందనం 8లో

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

### వాహనదారులు అతివేగంగా ప్రయాణించరాదు
### రాష్ట్ర రవాణా మరియు యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



రాయచోటి, రామాపురం, మేజర్‌న్యూస్: వాహన దారులు అతివేగంగా ప్రయాణించి ప్రాణాలకు హాని తెచ్చుకోరాదని రాష్ట్ర రవాణా మరియు యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి రామాపురం మండలం, చిట్లూరు గ్రామ సమీపంలో కారు, ట్యాంకర్ ఢీకొని జరిగిన ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అనంతరము రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలోని మృతదేహాలను పరిశీలించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ కడప చిత్తూరు జాతీయ రహదారిలో వాహనదారులు అతివేగంగా ప్రయాణించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయన్నారు. వాహనదారులు అతివేగంగా ప్రయాణించి తమ ప్రాణాలకు హాని తెచ్చుకోరాద న్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాణం ఎంతో విలువైనదని, రోడ్డు ప్రమాదాల మూలంగా ఏ ఒక్కరూ

# విద్యార్థుల వైద్యం పట్ల నిర్లక్ష్యం తగదు

### రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం అంకన్న



కడప ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్: ఖాజీపేటలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కలుషిత ఆహారం మొదట 15 మంది విద్యార్థినిలు చేరారని ఆసుపత్రిలో చేరారని ఆ తర్వాత 40పైగా విద్యార్థినీలు మరికొందరు చేరారని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం అంకన్న తెలిపారు శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటన జరిగి వారం రోజులు కావస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా జిల్లా సర్వజన ఆస్పత్రి రిమ్స్‌కి వెళ్లి విద్యార్థులను పరామర్శించ లేదని చెప్పారు ఆరోపించారు రిమ్స్ లో సరిగ్గా వైద్యం చేయడం లేదని స్వయానా విద్యార్థినీలు వారి తల్లిదండ్రులు బంధువులు ఆరోపిస్తున్న అక్కడ ఉన్న డాక్టర్లు పట్టించుకోలేదని వాపోయారు వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారన్నారని చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, ఆ ప్రాంతా నియోజకవర్గ శాసన సభ్యులు సుధాకర్ యాదవ్, కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవిరెడ్డికు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# ఎరువులు, పురుగు మందుల తనిఖీ



రైల్వేకోడూరు మేజర్ న్యూస్ రైల్వే కోడూరు పట్టణం లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను వ్యవసాయ కమిషనరేట్ గుంటూరు వారి ఏర్పాటు చేసిన ఉన్న పలంగా తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దుకాణాలలో స్టాక్ రిజిస్టర్ బిల్ బుక్స్ స్టాకులను పరిశీలించడం జరిగింది. అనుమతి పొందిన ఎరువులు పురుగు మందులు షాపులో అమ్ముతున్నారా లేదా పరిశీలించడం జరిగినట్లు రైల్వేకోడూరు వ్యవసాయ అధికారి సుధాకర్ తెలిపారు. ముఖ్యంగా ఆంధ్ర ఆగ్రో ఏజెన్సీస్ ఫారం 0 నిర్ణీత కాల పరిమితి ముగిసిన మహాధన్ అగ్రిటెక్ లిమిటెడ్ సరుకు గమనించినందున 6,88,100 విలువగల స్టాక్ ను నిలుపుదల చేయడం జరిగింది అని తెలిపారు తనిఖీల్లో సాలు రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు, రామకృష్ణ నాయక్ సబ్ ఇన్స్పెక్టర్ తిరుపతి మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ అధికారి రమేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక కోసం పెన్నానదిని పరిశీలించిన అధికారులు



సిద్ధవటం మేజర్ న్యూస్ సిద్ధవటం మండలం జ్యోతి గ్రామపంచాయతీ పెన్నా నది పరివాహ ప్రాంతాలలో శనివారం ఉన్నత అధికారుల ఆదేశాల ప్రకారం జూలై, 8 తేదీ నుండి ఇసుక రవాణా జరుపుటకు డంపింగ్ ప్రదేశా లను పరిశీలించారు. కార్యక్రమంలో మైనింగ్ ఇన్స్పెక్టర్,విమల మండల తాసిల్దార్ మురాద్వావలీ రెవెన్యూ ఇన్స్పెక్టర్ అనురాధ వీఆర్వో శ్యాంబాబు పాల్గొన్నారు మండల తాసిల్దార్ మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశాల ప్రకారం జ్యోతి గ్రామంలో శివాలయం వద్ద (2) ఇసుక డంపింగ్ రీచ్‌లను పరిశీలించామని తెలిపారు.

# చెట్లు కొమ్మల మధ్యలో విద్యుత్ వైర్లు



వీరబల్లి మేజర్ న్యూస్: అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం మండల స్థాయి విద్యుత్ అధికారులు పనితీరు ప్రశంసాపరంగా ఉన్నప్పటికీ గ్రామ స్థాయిలో పనిచేస్తున్న విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ప్రస్ఫుటంగా కనబడు తుంది. వీరబల్లి గ్రామం వీరబల్లి మండలం పాత ప్రమాదాన్ని తలపిస్తూ ఉంది దానికి దగ్గర "లోనే విద్యుత్ వైర్లు వెళుతున్నప్పటికీ కూడా అధికారులు పట్టించుకోక పోవడం విమర్శలకు తావిస్తోంది విద్యుత్ వైర్లు చెట్ల కొమ్మల మధ్యలో వెళుతున్నప్పటికీ కూడా వాటిని తొలగించక పోవడం వారి నిర్లక్ష్యానికి పరాకాష్ట అని చెప్పవచ్చు అలాగే మధ్యలో అనేక ప్రాంతాలలో అనేక చోట్ల చెట్ల మధ్యలో విద్యుత్ వైర్లు వెళుతున్నాయి. అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను తొలగిస్తారని ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా పండిత్ దీన్ దయాళ్ జయంతి వేడుకలు



పులివెందుల మేజర్ న్యూస్ భారతీయ జన్‌సంఘ్ వ్యవస్థాపకులు పండిత్ దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా ప్రధాని మోడీ పిలుపు మేరకు అమ్మ కోసం ఒక చెట్టు అనే కార్య క్రమంలో భాగంగా పులివెందుల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో అర్బన్ సిఐ బాలమద్దిలేటితో పాటు బిజెపి జిల్లా అధ్యక్షుడు శశి భూషణ్ రెడ్డి మొక్కలు నాటారు. పర్యావరణ సమతుల్యత ప్రతి మానవుడి బాధ్యత అని ఆయన తెలిపారు సకాలంలో వర్షాలు పడుటలో, పశు పక్షదులకు కావలసిన, ఆహారం, నీరు, రక్షణ, వృక్షాల వల్ల మాత్రమే సాధ్యం అని ఆయన తెలిపారు. కార్యక్రమంలో భాను ప్రకాష్, మహేశ్వర్ రెడ్డి, శ్రీరాములు, టీవీఎస్ భాస్కర్‌రెడ్డి, రామాంజనేయులు, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు

# మండల కేంద్రంలో ఆధార్ సెంటర్‌ని ఏర్పాటు చేయండి : సిపిఎం



కలసపాడు మేజర్ న్యూస్ : కలసపాడు మండల కేంద్రంలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సిపిఎం మండల నాయకులు, గురయ్య ప్రవీణ్ తెలిపారు. శనివారం సమస్య లపై వారు మాట్లాడుతూ, ప్రస్తుతం పాఠశాల తెరవడంతో విద్యార్థులకు ఆధార్ అనుసంధానం కోసం, దూర ప్రాంతంలో ఉన్న తెల్లబాడు, పిడుగుపల్లె గ్రామాలకు వెళ్లాల్సి వస్తుం దని, అక్కడ కూడా సమయానికి సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులు తల్లిదం డ్రులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసినట్లయితే ప్రతి ఒక్కరికి ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు. ప్రతి సంక్షేమ పథకాలను మీ సేవలకు అనుసంధానం చేయాలని తద్వారా ప్రజలకు కూడా మేలు కలుగు తుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ మండల సభ్యులు సుదర్శన్, అవాజ్ కమిటీ సభ్యులు, అన్వర్ భాష, జిలాని, రసూల్ కాసిం పీరా, హుస్సేన్ పీరా పాల్గొన్నారు.

# శునకాలకు రేబిస్ టీకాలు



సిద్ధవటం మేజర్ న్యూస్: మండల కేంద్రమైన సిద్ధవటం పశు వైద్యశాలలో శనివారం వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ప్రపంచ జినోసిన్ దినోత్సవం సందర్భంగా శునకా లకు రాబిస్ వ్యాధి సోకకుండా టీకా లు వేశారు ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీదేవి మాట్లాడుతూ శునకాల నుండి రాబిస్ వ్యాధి ప్రజలకు సోకకుండా శునకాలకు టీకాలు వేశావని వ్యాక్సిన్ అందుబాటులో ఉందని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. పల్లె ప్రాంతాల్లో ఉన్న పాడి పశువుల రైతులు వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని పశువుల దగ్గర అపరిశుభ్రత లేకుండా చూడాలని ఆమె అన్నారు. పశువులు వర్షానికి తడవకుండా రైతులు జాగ్రత్త పడాలని రాబిస్ వ్యాధి పట్ల ఎవరు కూడా ఆందోళన పడవలసిన పనిలేదని అన్నారు ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పశు వైద్య అధికారి డాక్టర్ శివ శంకర్, మహిళ వైద్యాధికారులు డాక్టర్ శ్వేత లైవ్ స్టాక్ అసిస్టెంట్ జిలాని సిబ్బంది నంద్యాల కృష్ణ పాల్గొన్నారు.

# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగజ్జీవన్ రావు : సిపిఐ



కడప సిటి మేజర్ న్యూస్: మాజీ ఉప ప్రధాని. డాక్టర్. బాబు జగజ్జీవన్‌రావు 38వ వర్ధంతి సందర్భంగా శనివారం నగరంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో డాక్టర్ బాబు జగజీవన్ రావు చిత్రపటానికి సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గాలి చంద్ర పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య సమరయోధుడిగా, కేంద్రమంత్రిగా, దేశ ఉపప్రధానిగా దేశానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు కె మునెయ్య పి చంద్రగుప్త, ఏఐటియుసి నాయకులు లింగన్న, ఏఐఎస్ఎఫ్ నాయకులు చంద్ర, శివతేజ తదితరులు పాల్గొన్నారు

# బాబు జగ్గీవన్ రామ్‌కు నివాళులు



కడప ఎర్రముక్కపల్లె మేజర్ న్యూస్: బాబు జగ్గీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద గల జగ్గీవన్ రామ్ విగ్రహానికి జై భీమ్ మాల మహాసేన అధ్యక్షులు పల్లెకొండు సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి చైతల్య పూలమాల వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కేంద్ర మంత్రిగా, కార్మిక శాఖ రక్షణ శాఖ మంత్రిగా అనేక సేవలందిం చిన గొప్ప సంఘ సంస్కర్త జగ్గీవన్ రాం అని కొనియాడారు ఆయన నేడు మన మధ్య లేనప్పటికీ దళిత బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలు మార్గ నిర్దేశకాలు ఎన్నటికీ మరువలేమన్నారు

# టిడిపి బలోపేతానికి శేషాచలపతి నాయుడు సేవలు అమోఘం

### మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ కితాబు



మదనపల్లె, మేజర్ న్యూస్ : తెలుగుదేశం పార్టీ బలోపేతానికి మాజీ కౌన్సిలర్ శేషాచలపతి నాయుడు సేవలు అమోఘమని మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు నాదెళ్ల విద్యాసాగర్ కితాబునిచ్చారు. శనివారం శేషాచలపతి నాయుడు జన్మదిన వేడుకలు ఎన్టీఆర్ కూడలిలో తెదేపా జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు,ఆయన మిత్రుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా కేక్ కట్ చేసి, బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు.ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాదెళ్ల విద్యాసాగర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి శేషాచలపతి నాయుడు సేవలు అమోఘమని, గతంలో కౌన్సిలరుగా ప్రజలకు నిర్విరామ సేవలందించారని కొనియాడారు. స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ స్ఫూర్తిగా, ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు పాలనను ఆదర్శంగా తీసుకుని ప్రజా సమస్యల పరి ష్కారం కోసం ఆయన పని చేస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా గెలుపులో ఆయన తనవంతు పాత్ర పోషించారన్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు శ్రమి స్తున్న శేషాచలపతినాయుడు ఆ భగవంతుడు ఆశీస్సులతో ఇలాంటి జన్మదిన వేడుక లు మరెన్నో జరుపుకోవాలని, భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంక రించా లని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాదెళ్ల శివన్న, జోళపాళ్యం దేవేంద్ర (చిన్ని), కట్టా దొరస్వామి నాయుడు, షంషీర్, బోనాల ఉమేష్, ప్రభు, మార్పురి గగన్, ప్రభాకర్, ప్రణవ్ రాయల్, హొటల్ శంకర, రామాపురం శీనా, బండి అమర, ముద్దుకృష్ణ నాయుడు, సాయి, కురబ సంఘం శివ, రెడ్డి శేఖర్, మేస్త్రి శ్రీనివాసులు పాల్గొన్నారు.

# బి.సి.జి టీకాతో టీబీ నుండి రక్షణ

### ఛాతీ వైద్య నిపుణులు డాక్టర్ అమరనాథ్ రెడ్డి వెల్లడి




మదనపల్లె,మేజర్ న్యూస్ : టిబి నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవాలంటే బి.సి.జి టీకా వేయించుకోవాలని జనరల్ ఆసుపత్రి మదనపల్లి ఛాతీ వైద్య నిపుణులు డాక్టర్ అమరనాథ్ రెడ్డి తెలిపారు.క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా బిసిజి టీకా కార్యక్రమంజరుగుతున్నదని ఆరు ప్రామాణిక అంశాలు గల వ్యక్తులకు ఈ టీకా వేయాలని ఆరోగ్య సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఇందులో భాగంగా శనివారం మదనపల్లె ప్రెస్ క్లబ్ నందు పాత్రికేయుల కోసం ప్రత్యేక బిసిజి టీకా పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశామని జనరల్ ఆసుపత్రి టిబి విభాగం సూపర్వైజర్ ప్రభాకర్ తెలిపారు.ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ 60 సంవత్సరాల వయస్సు పైబడినవారు 18 సంవత్సరాలు వయసు పైబడి షుగర్ వ్యాధిగ్రస్థులు, పొగ త్రాగేవారు, మూడు సంవత్సరాలు టిబి కొరకు మందులు మింగిన వారి కుటుంబసభ్యులు, గడిచిన ఐదు సంవత్సరాలలో టిబి సోకినవారు, బి.ఎమ్.ఐ 18 కన్నా తక్కువ ఉన్న వారు కచ్చితంగా ఈ బిసిజి వాక్సిన్ వేసుకోవాలని చెప్పారు. వాక్సిన్ వేసుకున్నాక గోకడం గాని, రుద్దడంగాని, కాపడం పెట్టడం కానీ చేయకూడదన్నారు. వాక్సిన్ వేసిన భాగంలో శుభ్రంగా పొడిగా ఉంచుకొని, ఆ గాయం త్వరగా మానటానికి గాలి తగిల టట్లు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిబి విభాగం సిబ్బంది దయాలన్, శాంతి, వనజ కుమారి,సచివాలయ హెల్త్ సెక్రెటరీలు ఉమాదేవి, జాన్సి, ఆశా నరసమ్మ పాల్గొన్నారు.

# డాక్టర్ కాశిరెడ్డి దాతృత్వం అభినందనీయం



కలసపాడు మేజర్ న్యూస్ : కలసపాడు మండలంలోని ఎగువ రామాపురం పాఠశాలల అభివృద్ధికి ముందుకు వచ్చిన డాక్టర్ గౌంగల్ రెడ్డి కాశిరెడ్డి దాతృత్వం అభినందనీయమని ఎస్టీయు రాష్ట్రఅదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎగువ తంబళ్లపల్లె గ్రామానికి చెందిన కీ?శే. గౌంగళ్ రెడ్డి వెంకటపతిరెడ్డి,పుల్లమ్మ దంపతుల కుమారుడైన కాశిరెడ్డి కర్ణాటక రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ సహాయ సంచాలకులుగా పని చేస్తూ పదవీవిరమణ చెందడం జరిగింది.శనివారం ఎగువరామాపురం జడ్పీ ఉన్నత పాఠశాల, ఎగువ తంబళ్లపల్లెలోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల లను కాశిరెడ్డి సందర్శించారు. ఆయనకు ప్రధానోపాధ్యాయులు ఎస్.కమాల్, పి.రామక్రిష్ణారెడ్డి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.ఈ సంధర్భంగా దాత కాశిరెడ్డి మాట్లాడుతూ స్వంత గ్రామానికి తనవంతు సహకారం అందించాలనే సదుద్దేశ్యంతో పేద బడుగు బలహీన మధ్యతరగతి వర్గాల పిల్లలు విద్యా పరంగా అభివృద్ధి చెందాలని భావించి ఎగువరామాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణం నిమిత్తం, మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో వంటగది నిర్మాణం నిమిత్తం సుమారు రూ.13లక్షల పైబడిన ఆర్థిక సహాయం చేయాలనే తలంపుతో ఇక్కడికి వచ్చానన్నారు. ఉపాధ్యాయ సంఘ నాయకుడు రమణారెడ్డి మాట్లాడుతూ తను పుట్టి పెరిగిన ప్రాంతానికి సేవలందించాలనే గొప్ప ఆలోచనతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన కాశిరెడ్డి లాంటివారు అరుదుగా ఉంటారన్నారు. విద్యాభివృద్ధికి సహకరి స్తున్న కాశిరెడ్డికి, వారి బంధువులైన టీచర్ పల్లె రామక్రిష్ణారెడ్డి, వారి సోదరుడు వెంకటరెడ్డికి ఉపాధ్యాయుల తరపున కృతజ్ఞతలు తెలియ జేస్తున్నామన్నారు. ఇలాంటివారి సేవానిరతిని జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కస్తూరి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎన్ని జన్మలెత్తినా నేల తల్లి రుణం తీర్చుకోలేనిది

## బీరం విద్యా సంస్థల చైర్మన్ సుబ్బారెడ్డి



చెన్నూరు మేజర్ న్యూస్ : మనల్ని జన్మంతా మోసే నేలతల్లి రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేమని బీరం విద్యా సంస్థల చైర్మన్ సుబ్బారెడ్డి అన్నారు. బీరం పాఠశాల ఆవరణంలో శనివారం విద్యార్థులతో కలిసి వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ప్రార్థనా గీతముతో కార్యక్ర మాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బీరం విద్యాసంస్థల చైర్మన్ సుబ్బా రెడ్డి, చైర్ పర్సన్ సరస్వతమ్మ మాట్లాడుతూ చెట్లు మనకు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరమని, చెట్ల వలన గాలి, నీడ, ఆహారం, పండ్లు, కాయలు మరెన్నో లభిస్తాయని కాబట్టి ఎవరూ చెట్లను కొట్టివేయద్దన్నారు. పిల్లలం దరికీ మీ ప్రతి పుట్టినరోజున ఒక చెట్టు నాటలని సూచించారు. పాఠశాల ఆవరణలో వారు పిల్లలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం బీరం విద్యా సంస్థల డైరెక్టర్ బీరం స్వాతి శ్రీకాంత్ మాట్లాడుతూ మానవుని మనుగడకు అనంత జీవుల మనుగడకు ముఖ్యమైనవి చెట్లని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రమైన వాతావరణంలో సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలంటే అందుకు మొక్కలు నాటడం ఒక్కటే మార్గమని, తెలియ జేశారు. అడవులను విచక్షణారహితంగా నరికి వేస్తున్న వారి పట్ల కఠిన చర్యలు తీసు కోవాలని వారు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్వేతా, కళాశాల ప్రిన్సిపల్ హేమ్ చందర్,అధ్యాపకులు, పీ.ఈ.టీలు పాల్గొన్నారు.

# అదనపు బాధ్యతలు స్వీకరించిన ఎం.వి రమణ



ఖాజీపేట మేజర్ న్యూస్ మండల కేంద్రమైన ఖాజీపేటలోని ఎంపీడీఒ కార్యాలయంలో పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎం.వి రమణ శనివారం రోజున అదనపు బాధ్యతలు తీసుకున్నారు జిల్లా పరిషత్ సీఇఓ ఆదేశాల మేరకు ఖాజీపేట ఎం.పీ.డీ.ఒ కార్యాలయంలో ఎంపీడీఒగా విధులు నిర్వహిస్తున్న సుమిత్రమ్మ నంద్యాల జిల్లాకు బదిలీపై వెళ్లారు అనంతరం వారి స్థానంలోఎం.పీ.డీ.ఒ గా ఎం.వి రమణ బాధ్యతలు చేపట్టారు

# నూతన మంత్రిని సన్మానించిన కడప టిడిపి నాయకులు



కడప ఐటిఐ సర్కిల్ మేజర్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫారుక్ ను నంద్యాలలోని వారి కార్యాలయంలో కడప ఎన్నారై, టిడిపి మైనార్టీ నాయకులు ఎన్నారై రహమతుల్లా, ఖాదర్, సజ్జాద్, కొమ్మలపాటి సుబ్బరాయుడు, షామీర్, నూర్, నిత్యరాజు కలిసి మంత్రిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కడప ఎన్నారై టిడిపి నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎన్నారైలు, టిడిపి నాయకులు కలిసి అద్భుతంగా పనిచేసి పార్టీకి విశిష్ట సేవలందించారన్నారు. రాష్ట్రంలోని మైనార్టీలకు అద్భుతమైన సేవలందించి, వారి అభివృద్ధి, అభ్యున్నతి కోసం పాటుపడాలని వారు కోరారు.

# డిప్యూటీ సీఎంకు ఓఎస్డిగా మధుసూదన్

## కోటకొండలో ప్రజల అభినందన వెల్లువ

తంబళ్లపల్లె, మేజర్ న్యూస్ : తంబళ్లపల్లి మండలంలోనీ కోటకొండ కు చెందిన రెవెన్యూ ఉద్యోగి గజ్జెల రామచంద్ర కుమారుడు గజ్జెల మధుసూదన్ గత ఐదేళ్ల క్రితం ఐఏఎస్ లో ర్యాంకు సాధించి మండలంలోనే ఆదర్శంగా నిలిచాడు. మధుసూదన్ గతంలో నెల్లూరు, ధర్మవరం, అనంతపురం ప్రస్తుతం కడప ఆర్డీవోగా పని చేస్తున్నారు. తన విధి నిర్వహణలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిష్పక్షపాతంగా వ్యవహరించి నిజాయితీగా పనిచేసిన మధుసూదన్ పని తీరు ను గమనించిన రాష్ట్ర డిప్యూటీ సీఎం కొనెదెల పవన్ కళ్యాణ్ మధుసూదన్‌ను తన ఓఎస్డిగా నియమించుకున్నారు. పవన్ కళ్యాణ్‌కు ఓఎస్‌డిగా నియామకం పై ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ జాయింట్ సెక్రెటరీ గజ్జెల రెడ్డప్పతోబాటు తంబళ్లపల్లె జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆర్డీవో మధు సూదన్‌ను అభినందించారు. శనివారం మధుసూదన్ స్వగ్రామం తంబళ్లపల్లె మండలం కోటకొండలో ఆయన కుటుంబ సభ్యులతో పాటు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేస్తూ మధుసూదన్ మరింత ఉన్నత స్థాయికి ఎదిగి నిరుపేద ప్రజలకు న్యాయం చేయాలని ఆకాంక్షించారు.

# పట్టుబడ్డ 32 ఎర్రచందనం దుంగలు



రాజంపేట, మేజర్ న్యూస్ రాజంపేట అన్నమయ్య జిల్లా డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ అధికారి వివేక్ ఆదేశాల మేరకు రాజంపేట రేంజ్ పరిధిలోని రోళ్లమడుగు తుమ్మల బయలు బీట్ ప్రదేశాల్లో ఆటవి సిబ్బంది, బేస్ క్యాంప్ ప్రొటెక్షన్ సిబ్బంది కూంబింగ్ నిర్వహిస్తుండగా శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో రోళ్లమడుగు బీట్ ప్రదేశంలోని మొలకచెట్ల కోన ప్రదేశంలో తనిఖీ చేస్తూ ఉండగా కొంత మంది గుర్తు తెలియని ముద్దాయిలు మమ్మల్ని చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకోవడానికి ప్రయత్నం చేయగా వారు తప్పించుకోని పారిపోయారు ఆ ప్రదేశంలో క్షుణ్ణంగా తనిఖీ చేయగా 32 ఎర్రచందనం దుంగలను కనుగొన్నారు. వాటిని స్వాధీనం చేసు కుని ఆటవిశాఖ కార్యాలయంకు తరలించబడినవి వాటి బరువు 976 కిలోలు సుమారు వాటి విలువ 2,75,000గా నిర్ణయించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు రవి శంకర్కి కిరణ్ కుమార్, సుబ్బరాయుడు, ఉపేంద్ర, ప్రసాద్ నాయక్ జగన్ బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు అని రేంజ్ అధికారి ఆర్ నారాయణ ఓ ప్రకటనలో తెలియజేశారు.

# బహుజనుల అభ్యున్నతికి కృషి చేయాలని వినతి



కడప ఐటిఐ సర్కిల్ మేజర్ న్యూస్: బహుజన సంక్షేమ సమితి రాష్ట్ర యువజన అధ్యక్షులు ఇరగ దిండ్ల హరీష్ కుమార్ శనివారం కడప జిల్లా నూతన కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గౌతమ బుద్ధుని చిత్రపటాన్ని బహూ కరించి, శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కడప కలెక్టరేట్ లో నూతన జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ను బిఎస్ఎస్ తరపున కలవడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి కృషి చేయాలని కలెక్టర్‌కు విన్నవించామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాల ల్లో ,సంక్షేమ వసతి గృహాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువజన అధ్యక్షులు బుక్కె నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు వేణుగోపాల్ నాయక్, బహుజన సంక్షేమ సమితి జిల్లా నాయకులు హేమంత్ కుమార్ పాల్గొన్నారు

# డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి



రాజంపేట, మేజర్‌న్యూస్ రాజంపేటలోని బిజెపికార్యాలయం లో శనివారం జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా వారు చిత్రపటానికి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతు గుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ

ఏక్ దేశ్ మే దో విధాన్ – ఏక్ దేశ్ మే దో నిశాన్ ఏక్‌దేశ్ మే దో ప్రధాన్ నహీ చలేంగే నహీ చలేంగే అంటూ కాశ్మీర్ కోసం పోరాడిన మహనీయులు

జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిన గొప్ప నాయకుడని అన్నారు. ఆనాడు వారు చేసిన బలి దానం కారణంగానే నేడు కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగంగా ఉందని అన్నారు ఒక దేశంలో రెండు జెండాలు రెండు ప్రధాన మంత్రులు రెండు రాజ్యాంగాలు ఉండకూడదని దేశవ్యాప్తంగా ఉద్యమం చేసి కాశ్మీర్లోనే తన ప్రాణాలర్పించిన గొప్ప దేశభక్తుడని వారిని ఆదర్శంగా తీసు కొని అందరూ ముందుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టు పోగుల ఆదినారాయణ బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శిలు రమణ జీకే నాగరాజు బిజెపి మండల ఉపాధ్యక్షులు డాక్టర్ వేణు ప్రసాద్ రాజు బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీ పాపయ్య బిజెపి పట్టణ కార్యదర్శి పి రమణ బిజెపి సీనియర్ నాయకులు సుబ్బారావు తోట నగేష్ కే శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ప్రతి లబ్ధిదారునికి ఉచిత ఇసుక

## టిడిపి ఇన్చార్జి దాసరిపల్లి జయచంద్ర రెడ్డి



ములకలచెరువు,మేజర్ న్యూస్: ఇళ్ల నిర్మాణదారులందరికి ఉచిత ఇసుక చర్యలు తీసుకుంటున్నట్ల తంబళ్లపల్లె నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ దాసరిపల్లి జయ చంద్ర రెడ్డి పేర్కొన్నారు. ములకల చెరువులోని పార్టీ కార్యాలయంలో శని వారం తంబళ్లపల్లె మండల టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లబ్ధిదారులకు పంపిణీ చేస్తారన్నారు. లబ్ధిదారులందరికీ ఉచిత ఇసుక చూడాల్సిన బాధ్యత ప్రతి టీడీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఉచితంగా ఇసుకను అందిస్తు న్నారన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు పాలగిరి సిద్ధ, రెడ్డప్పరెడ్డి, బేరి శ్రీనివాసులు, కేశవ, సిద్ధమ్మ,శివ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపీ మోడల్ స్కూలుకు బస్సు సౌకర్యం కల్పించాలని మంత్రికి వినతి



లక్కిరెడ్డిపల్లి, మేజర్ న్యూస్ లక్కిరెడ్డిపల్లి మండలంలోని ఏపీ మోడల్ విద్యార్థుల రవాణా కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని శనివారం రవాణా క్రీడల యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివ శంకర్ రెడ్డి ఉపాధ్యాయులతో కలిస వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భం గా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఏపీ మోడల్ స్కూల్లో 700 మంది విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి పాఠశాలకు వస్తున్నారని, దూర ప్రాంతాలైన పందిళ్ళపల్లి, కోనంపేట, పాలెం, గొల్లపల్లి, గాలివీడు మండలాల నుంచి విద్యార్థులకు పాఠశాలకు రావడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బస్సు సర్వీసును ఏర్పాటు చేస్తే విద్యార్థులు సకాలంలో పాఠశాలకు వస్తారని మంత్రికి తెలియజేశారు. వెంటనే స్పందించిన మంత్రి వెంటనే రాయచోటి డిపో మేనేజర్‌కు ఫోన్ చేసి త్వరలో లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్కు బస్ సర్వీసులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కలెక్టరును కలిసిన వైవియు కుల సచివులు



కడప వైవీ యూ మేజర్ న్యూస్: జిల్లా నూతన కలెక్టర్ లోతేటి శివ శంకర్‌ను యోగి వేమన విశ్వవిద్యాలయం బాధ్య కుల సచివులు ఆచార్య ఎస్ రఘునాథ్ రెడ్డి కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలి పారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రగతి గురించి వివరించారు. విశ్వ విద్యాలయలో కోర్సులు, విద్యార్థుల గురించి కలెక్టర్ వాకబు చేశారు.

## నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన శివశంకర్ లోతేటి

మొదటి పేజీ తరువాయి

తంగా అభివృద్ధి పథంలో నడిపిస్తా మన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను.. ప్రజలకు సంతృప్త స్థాయిలో అందేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అనంతరం పలువురు జిల్లా అధికా రులు, ప్రముఖులు, పాత్రికేయులు, తదితరులు పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికి జిల్లా కలెక్టర్ కు తమ అభినందనలు తెలియజే శారు.ఈ కార్యక్రమంలో జేసీ గణేష్ కుమార్, కడప నగర కమీషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్, డిఆర్వో గంగాధర్ గౌడ్, పలువురు జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు

## బత్యాలకు శుభాకాంక్షలు తెలియజేసిన ఎన్డీఏ కూటమి నాయకులు



ఓబులవారిపల్లి, మేజర్‌న్యూస్: బత్యాల 69వ పుట్టినరోజు సందర్భంగా ఓబులవారిపల్లె ఎన్డీఏ కూటమి నాయకులు బొక్క సం సునీల్ బత్యాల యువసేన నాయకులు పోతురాజు నవీన్ అనంత రాజంపేట మాజీ ఎంపీటీసీ గ్రంధి బాలసుబ్రమణ్యం మార్గాల హేమ రాజు నాగిశెట్టి చంద్రమౌళి శేష అక్క గారి పల్లి వెంకటసుబ్బయ్య బత్యాల అభిమానులు కలిసి కోడూరులోని బత్యాల కళ్యాణమండపం నందు నిర్వహించిన పుట్టినరోజు వేడుకలో పాల్గొని శాలువా గజమాలతో సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా పోతురాజు నవీన్ బత్యాల గ్రంధి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు ఉచితంగా దుప్పట్లు ప్లేట్లు పంపిణీ చేసి 30 మందికి వైద్య కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని 150 మంది రక్తదానం చేయడం జరిగిందన్నారు నాగిశెట్టి చంద్రమౌళి మద్దెల వెంకటసుబ్బయ్య కటికం నాగరాజు సునీత పాల్గొన్నారు.



## వైవీయూలో మాతృమూర్తి ప్రశంసగా మొక్క

### ప్రాంగణంలో మొక్కలు నాటిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు




కడప వైవియూ, మేజర్‌న్యూస్: మాతృమూర్తి ప్రశంసగా ఒక మొక్కను నాటండి" అంటూ దేశ ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు యోగివేమన విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ -9, 3 ప్రోగ్రాం ఆఫీసర్లు.కె. శ్రీనివాసరావు, డా॥ శ్రీధర్ రెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన భూగ్రహాన్ని మెరుగైందిగా తీర్చిదిద్దడంలో మనందరి తోడ్పాటు అవసరం అన్నారు. ప్రధానమంత్రి ఆకాంక్ష ను నెరవేర్చిన భూమాతను కాపాడుకొందామంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సహ ఆచార్యులు డా.బి. రెడ్డయ్య, కంప్యూటర్ సైన్స్ టెక్నాలజీ విభాగంల విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఆడా ఉంటాం.. ఈడా ఉంటాం...

మొదటి పేజీ తరువాయి

బాటలో అన్నమయ్య జిల్లాలో కూడా టిడిపిలోకి జంప్ చేసేందుకు పలువురు వైకాపా నాయకులు, చైర్మన్లు రంగం సిద్ధం చేసుకుంటున్నారని జోరుగా వార్తలు వినిపిస్తున్నాయి. అయితే వైకాపా నుంచి టీడీపీలోకి నాయకులను ఆహ్వానించడం పట్ల అధిష్టానం, ఇతర నాయకులు ఎలా స్పందిస్తున్నా, వారికి ఉన్న రాజకీయ ఆలోచనలు ఎలా ఉన్నా, సామాన్య కార్యకర్తలు మాత్రం అవకాశవాద నాయకులను పార్టీలో చేర్చుకుంటే భవిష్యత్తులో టిడిపికి కూడా నష్టం కలుగుతుందని, గతంలో వైకాపాలో ఉన్న పరిచయాలతో టిడిపి నాయకులు కార్యకర్తలకు న్యాయం జరగడం కంటే వైకాపా నాయకులు కార్యకర్తలకే ఎక్కువ న్యాయం జరిగే అవకాశం ఉంటుందని, వైకాపా అధికారంలో ఉన్నప్పుడు, ప్రస్తుతం టిడిపి అధికారంలో ఉన్నప్పుడు కూడా వారిదే పెత్తనం అయితే మరి కష్టపడ్డ నాయకులు, కార్యకర్తల పరిస్థితి ఏంటో అని తెలుగు తమ్ముళ్లు ఆలోచనలో పడ్డారు. అయితే టిడిపి అధినేత చంద్రబాబు అవకాశవాద నాయకులకు టిడిపిలో అవకాశం లేదని చెప్పిన కొన్ని ప్రాంతాలలో ఈ తతంగం జరుగుతుండడం, దీని వెనుక ఎటువంటి రాజకీయ ప్రయోజనాలు ఉన్నా, టిడిపి గెలుపు కోసం ఎన్నో అవమానాలను, ఇబ్బందులను ఎదుర్కొన్న సామాన్య కార్యకర్తలు మాత్రం ఈ జంపింగ్ ల విషయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

**ఆడా ఉంటాం.. ఈడా ఉంటాం...**

ఆడ ఉంటాం ఈడ ఉంటాం అంటూ కొందరు బహిరంగంగానే ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రకటనలు చేస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి వంత పాడుతూ ముందుకు వెళ్తామని, బహిరంగంగానే చెబుతూ టిడిపిలోకి వచ్చేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అయితే అలా వచ్చే వారి వల్ల తీవ్రంగా ఇబ్బందులు పడ్డ వారు మాత్రం అధికారంలోకి వచ్చిన ఆనందం ఒక నెల కూడా మిగలలేదే అనే భావనలో ఉంటూ, టిడిపి అధికారంలో ఉన్న సమయంలో కూడా వలస నాయకుల పంచన ఉండవలసి వస్తుందని ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరి టిడిపి కార్యకర్తల మనోభావాలను అధిష్టానం పట్టించుకుంటుందో లేక రాజకీయ అవసరాల కోసం కార్యకర్తల కష్టాన్ని, పడిన ఇబ్బందులను పక్కన పెడుతుందో వేచి చూడాలి.

## వేముల మండలంలో మాజీ సిఎం జగన్



వేముల, మేజర్‌న్యూస్: వైఎస్ఆర్సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సోమవారం వైఎస్ఆర్ 75వ జయంతి సందర్భంగా శనివారం పులివెందులకి రావడంతో వేముల మండలంలోని ప్రజలు దారి పొడువునా అడుగు అడుగునా ప్రజలు వైఎస్ఆర్సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి బ్రహ్మరథం పట్టారు.కడప పులివెందుల ప్రధాన రహదారిలో రోడ్డు మార్గాన వేముల మీదుగా పులివెందుల చేరుకున్నారు.ముందుగా వేముల మండలం లో దుగ్గన్న గారి పల్లి వద్ద చెన్నారెడ్డి,వేమనారాయణ రెడ్డి ఆధ్వర్యం లో స్వాగతం పలికారు అలాగే స్కూల్ వద్ద పాఠశాల విద్యార్థులతో మాట్లాడి విద్యార్థులకు సెల్ఫీ ఆయన తీశారు.అనంతరం అమ్మయ్యగారిపల్లి వద్ద రాఘవరెడ్డి ఆధ్వర్యం లో, చగా లేరు క్రాస్ వద్ద మాజీ ఎంపీటీసీ చంద్ర శేఖర్ రెడ్డి, రెడ్డెయ్య,ఆధ్వర్యం లో కొత్తపల్లి వద్ద మాజీ ఎంపీటీసీ మల్ రెడ్డి ఆధ్వర్యం లో గొందిపల్లి క్రాస్ వద్ద విజయ భాస్కర్ రెడ్డి,ఆధ్వర్యం లో స్వాగతం పలికారు.వేముల లో ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకట నారాయణ,సర్పంచ్ నాగప్ప,బస్ సుబ్బారెడ్డి,రామ సుబ్బారెడ్డి,కో ఆప్షన్ మండి మా పీరా,చప్పిడి భాస్కర్ రెడ్డి,ఆధ్వర్యం లో ఘన స్వాగతం పలికారు.వేముల క్రిస్టియన్ కాలనీ వద్ద ఉన్న తెలుగు క్రైస్తవ చర్చి లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.2029 లో మళ్ళీ రాజన్న రాజ్యం వస్తుంది అని వారు అన్నారు. అలాగే వేముల కృప నగర్ వద్ద సుబ్బారెడ్డి,రాజా,చల్లా శివ రామ కృష్ణయ్య,మాజీ సర్పంచ్ రాజన్న, ముస్కిన్,లక్ష్మణ నాయకులు కార్యకర్తలు అభిమానులు దారి పొడువునా ఘన స్వాగతం పలికారు.బేస్తవారి పల్లి వద్ద కార్యకర్త మల్లికార్జున ను పరామర్శించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

మొదటి పేజీ తరువాయి




ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు లేకుండా ఇకనుంచి జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేయాలన్నారు. ప్రమాదాల బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, కల్వర్టులు, రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ లేకుండా వాహనాలను నడపడం చాలా ప్రమాదకరమని అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోవడం జరుగుతోందన్నారు. జనాభా తో పాటు వాహనాల వినియోగం కూడా పెరుగుతున్న నేపథ్యంలో రవాణా శాఖ, అనుబంధ శాఖల అధికారులు రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి వాహన ప్రమాదాలను అరికట్టే దిశగా పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలన్నారు.

**కడప-రాయచోటి ఘాట్లో సొరంగ మార్గం**

కడప-రాయచోటి ఘాట్ రోడ్డు నందు త్వరలో సొరంగం తవ్వి నాలుగు వరుసల రహదారి నిర్మించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగిందని త్వరలో పనులు ప్రారంభించి ఈ ప్రాంతవాసుల చిరకాల కలను నెరవేర్చడం జరుగుతుందన్నారు. సొరంగ మార్గం ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతంలో చాలావరకు ప్రమాదాలను నివారించవచ్చు న్నారు. రాబోయే రోజులలో వాహనదారుల సమస్యలను పూర్తిగా పరిష్కరించడం జరుగుతుందన్నారు.



## వైవీయూ బీఈడీ ఎంఈడి పరీక్షల తనిఖీ



కడప వైవియూ, మేజర్‌న్యూస్: యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో జరుగుతున్న బీఈడీ ఎంఈడి 2,4 సెమిస్టర్ పరీక్షలను వైవియు కులసచివులు, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ రఘునాథరెడ్డి తనిఖీ చేశారు. కడపలోని ఎస్వీ బీఈడీ కళాశాల, రాయచోటి శివాల్లో ఉన్న భారత్ బీఈడీ కళాశాల కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాల ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. కేంద్ర అబ్జర్వర్లు పరీక్షలను కేంద్రంలో ఉండి పర్యవేక్షించగా, విశ్వవిద్యాలయ హైపవర్ కమిటీ బృందాలు అన్ని కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లాలోని 15 కేంద్రాల్లో 3,143 విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎన్ని ఈశ్వర్ రెడ్డి తెలిపారు.

సూర్య www.SURYAA.com

07 ఆదివారం, జులై 2024

## వాహనదారులను ఇబ్బందిపెట్టొద్దు : ఎమ్మెల్యే



ప్రొద్దుటూరు మేజర్ న్యూస్ వాహన దారులను ఇబ్బంది పెట్టకుండా సేవలం దించాలని ఆర్టీఓ కార్యాలయ అధికారు లకు ఎమ్మెల్యే నంద్యాల వరద రాజుల రెడ్డి సూచించారు. శనివారం ఆయన స్థానిక ఆర్టీఓ కార్యాలయాన్ని ఆకస్మికం గా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రవాణాశాఖలో జరుగు తున్న పనులు వాహనాల ట్రాన్స్ ఫర్స్, లైసెన్స్‌ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయానికి పనులపై వచ్చిన అర్జీదారులను అధికారులు ఎవరైనా డబ్బు అడుగుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలోని పనులపై ఆర్టీఓ, ఎంవిఐ అధికారులతో కలసి పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ లంచాలకు తావు లేకుండా వాహనదారులకు సేవలందించాలని తెలిపారు.

## విలక్షణమైన రాజకీయ నాయకుడు బాబు జగ్జీవన్ రామ్

### డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి



వేంపల్లె మేజర్ న్యూస్: భారత దేశ రాజకీయాల్లో బాబూ జగ్జీవన్ రామ్ విలక్షణమైన రాజకీయ నాయకుడని ఏపిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శని వారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయ కులతో కలిసి జగ్జీవన్‌రామ్ వర్థంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ 1946 నుంచి 1986 వరకు దాదాపు 40 ఏళ్ల పాటు బీహార్ రాష్ట్రంలోని ససార్ లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహించిన బాబు జగ్జీవన్ రామ్ ప్రపంచ రికార్డు నెలకొల్పినట్లు వివరించారు. 30 ఏళ్ల పాటు కేంద్రమంత్రిగా జాతీయ రికార్డు నెలకొల్పిన ఘనత జగ్జీవన్ రామ్ ది అన్నారు. కేంద్ర వ్యవసాయ మంత్రిగా, కేంద్ర రక్షణ శాఖ మంత్రిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శం, అనుసర ణీయం, స్ఫూర్తిదాయకమని తులసిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు, ఐద్రీ, ఆరుశేర్ల సుబ్బరాయుడు, మహబూబ్ బాషా, మదార్ బాషా తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రేషన్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయండి

### ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి




ప్రొద్దుటూరు మేజర్ న్యూస్ : ప్రొద్దుటూరు కేంద్రంగా జరిగే అక్రమ రేషన్ రవాణాకు ఇకనైనా అడ్డుకట్ట వేయాలనిశాసనసభ్యులు నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక నెహ్రూ రోడ్డు లోని ఆయన కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డ రేషన్ బియ్యం ప్రొద్దుటూరు కు చెందినవిగా అధికారులు ధృవీకరించారని, ఇకనైనా ప్రొద్దుటూరులో జరిగే అక్రమరేషన్ రవాణాకు అడ్డుకట్ట వేయాలని తహశీల్దార్ విద్యాసాగర్, సివిల్ సప్లై అధికారులకు ఆయన సూచించారు. ప్రొద్దుటూరు నుండి కర్నాటకకు రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని, దళారీలు, మధ్యవర్తులు రేషన్ బియ్యాన్ని మైదుకూరు గోదాములలో నిల్వ వుంచి నల్లబజారుకు తరలిస్తున్నారని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల కోసం కిలో రూపాయి బియ్యం అందిస్తుంటే, కొంతమంది అక్రమంగా ఈ బియ్యాన్ని అక్రమ మార్గాల్లో వారికి అందకుండా చేయడం సరైంది కాదన్నారు. అధికారులు కేవలం మామూళ్ల మత్తు తోనే అడ్డుకట్ట వేయడం లేదని ఆరోపిం చారు. అధికారులు బ్లాక్ మార్కెటింగ్ ను ఆపకపోతే వేటు తప్పదన్నారు. ఈ విషయాన్ని నూతన కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీలో గంజాయి పట్టుబడడం బాధకరం

### టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి



వేంపల్లె మేజర్ న్యూస్: ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీ లో ఇటీవల గంజాయి పట్టు బడడం బాధకరమని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ గోపాల్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీని పర్యటించారు. అనంతరం డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, కోర్ కమిటీ సభ్యు లతో సమావేశమయ్యారు. దాదాపు 8500 మంది చదువుతున్న ట్రిపుల్ ఐటీలో అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోవడం, బాహ్య ప్రపంచానికి తెలిసి కళాశాల ప్రతిష్టకు భంగం కలిగే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు కూడా ఆందోళన చెందారని వివరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని లోకేష్ బాబు సూచించినట్లు ఎమ్మెల్సీ వెల్లడించారు. అలాగే హాస్టల్ గదులు పరిశీలించారు. విద్యార్థులతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో మధ్యాహ్న భోజనం చేశారు.

## యువతకు ఉద్యోగ కల్పనే జాబ్ మేళా




కడప రూరల్ మేజర్ న్యూస్: నగరంలోని స్పిరిట్స్ కాలేజీ లో శనివారం నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కడప టీడీపీ జిల్లా అధ్యక్షులు, పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డెప్పగారి శ్రీనివాస రెడ్డి కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ యువత ఉద్యోగాల కోసమే ఇలాంటి జాబ్ మేళా లు నిర్వహిస్తారని తెలిపారు ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు

## పుల్లూరు సచివాలయం భవనంపై మాజీ ముఖ్యమంత్రి చిత్రపటం తొలగింపు



ఖాజీపేట మేజర్ న్యూస్ మండల కేంద్రమైన ఖాజీపేటలోని పుల్లూరు సచి వాలయ భవనంపైన మాజీ ముఖ్య మం త్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్ర పటా లను తొలగించారు కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు చిత్రపటాలను టిడిపి శ్రేణులు సచివాలయంలో అమ ర్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకు లు ఇరగంరెడ్డి ప్రసాద్‌రెడ్డి నంద్యాల సుబ్బయ్య యాదవ్ మిట్ట హరిరెడ్డి కోటశివారెడ్డి శ్రీను ఆదిఈశ్వర్ రెడ్డి గణేష్ మీసాల విశ్వేశ్వరరావు డాక్టర్ వర్ర.సత్యానందరావు బత్తల నవీన్ మీసాలరవి శీలం వినోద్

## హౌసింగ్ లేఔట్‌ను పరిశీలించిన ప్రాజెక్టు డైరెక్టర్



పులివెందుల మేజర్ న్యూస్ పులివెందుల పట్టణంలో నిర్మి స్తున్న మెగా లేఔట్ ను శనివారం హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పులివెందుల మున్సి పాలిటీ పరిధిలో 8400 గృహములు మంజూరు కావడం జరిగిందని మెగా లేఔట్ లో 7075 గృహములు నిర్మించడం జరుగుతుందని ఇందుకు సంబం ధించి లేఔట్ లోని సిమెంటు, స్టీలు, ఇసుక తదితర సామాగ్రి పరిశీలించడం జరిగింది. లేఔట్ నందు మెటీరియల్ దొంగతనం కాకుండా లే అవుట్‌కు భద్రతగా కొంత మంది సిబ్బందిని ఏర్పాటు చేయాలని పులివెందుల కమిషనర్ రమణారెడ్డికి లిఖితపూర్వకంగా లేక ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈ ఈ హౌసింగ్, రాజారత్నం, ఏఈలు సంజీవ రాయుడు, ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

## 'మన చరిత'ను ఆవిష్కరించిన కలెక్టర్



కడప కలెక్టరేట్ మేజర్ న్యూస్: ఇంటాక్ (భారత జాతీయ కళా సాంస్కృ తిక వారసత్వ పరిరక్షణ సంస్థ) జిల్లా చాప్టర్ ప్రచురిస్తున్న (రెండవ) జూలై బులెటిన్ ను నూతన జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ తో కలిసి ఆవిష్కరించారు. చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నప్ప రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సంస్థ సభ్యులు కలెక్టర్‌ను ఆయన చాంబర్లో కలిసి ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. సంస్థ ప్రచురిస్తున్న మన చరిత న్యూస్ బులెటిన్ రెండవ సంచికను ఈ సందర్భంగా కలెక్టర్, జెసితో కలిసి ఆవిష్కరించారు. గత మాసం బులిటిన్ కవర్ పేజీపై గల ఒంటిమిట్ట కథనాన్ని చూసి తాను ఇంతకుముందే ఈ క్షేత్రాన్ని సందర్శించామని తెలిపారు. ఇంటాక్ ప్రచురణలను పరిశీలించి ఇన్ని పుస్తకాలను చేస్తున్నందుకు సంస్థను అభినం దించారు. జిల్లా అభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ అంశాల పట్ల తనకు ఆసక్తి ఉందని ఆయన తెలిపారు. మన కలెక్టరేట్ పుస్తకాన్ని పరిశీలించి ఈ అంశంపై ప్రత్యేకంగా పుస్తకం చదవడం పట్ల సంస్థ కు జిల్లా పట్లగల అభిమానాన్ని తెలుపుతుందన్నారు. జిల్లా వారస త్వం పర్యా టక అభివృద్ధిపై చేస్తున్న కృషికి సంబంధించిన ఫోటోలు సమాచారాన్ని చూసి సభ్యులంద రినీ, మన చరిత బులిటిన్‌ను ప్రతినెల ప్రచురించడం పట్ల ప్రత్యే కంగా అభినందించారు. కలెక్టర్‌ను సభ్యులందరూ కలిసి ఘనంగా సత్కరించి జిల్లా వారసత్వ సమాచారంతో ప్రచురించిన పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు భారవి, గౌరీ శంకర్, దేవతి రవి, డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి, ఆచార్య జి. సాంబశివరెడ్డి, కె. రాఘవేంద్ర వర్మ, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరా చారి పాల్గొన్నారు

## గుండెపోటుతో సిఆర్పి మృతి



తంబళ్లపల్లె, మేజర్ న్యూస్: తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె సిఆర్పి (క్లస్టర్ రిసోర్స్ పర్సన్) చంద్రశేఖర్ (52) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. మదనపల్లికు చెందిన చంద్రశేఖర్ కొంతకాలంగా తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె సిఆర్పిగా పని చేస్తు న్నాడు. ఈ కోవలో శనివారం మదనపల్లి జడ్పీ హైస్కూల్లో సిఆర్పిలు, ఉపాధ్యాయులకు టూల్ ట్రైనింగ్ కార్యక్రమంలో పాల్గొన్నాడు. ట్రైనింగ్ మధ్యలో చంద్రశేఖర్‌కు గొంతులో నొప్పి రావడంతో వెంటనే అధికారుల అనుమతితో ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్సకు వెళ్లాడు. అక్కడ డాక్టర్ వచ్చే లోపే చంద్రశేఖర్‌కు గుండెపోటు వచ్చి ఆకస్మిక మృతి చెందాడు. ఆయనకు భార్య భారతి పిల్లలు నిఖిత, సంగీత ఉన్నారు. చంద్రశేఖర్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిం చారు. చంద్రశేఖర్ మృతికి రాష్ట్ర సిఆర్పీల సంఘం అధ్యక్షుడు గోవర్ధన్, జిల్లా అధ్యక్షుడు సుధాకర్, సీఎంఓ కరుణా కర్, తంబళ్లపల్లి ఎంఈఓలు త్యాగ రాజు, నాగ సుబ్బరాయుడు, సహచర సిఆర్పిలు, ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించి శ్రద్ధాంజలి ఘటించారు. చంద్రశేఖర్ కుటుంబానికి సిఆర్పిలు, ఉపాధ్యాయ సంఘాలు రూ1.50 లక్షలు ఆర్థిక సాయం అందించారు.

## అబ్బాయి కనపడులేదని పోలీస్ స్టేషన్లో పిర్యాదు



చాపాడు మేజర్ న్యూస్ : మండల పరిధిలోని గుంత చియ్యపాడు గ్రామా నికి నీలపాల గంగయ్య, నాగలక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు గౌతం, వయస్సు 15 సం.లు పదవ తరగతి మైదుకూరు మాంటి స్సోరి స్కూల్లో చదువుతున్నాడు. శుక్రవా రం ఉదయం 05:30 గంటల నుండి గౌతమ్ కనిపించడం లేదని, రాత్రి ఇంటి బయట వరండాలో పడుకొన్నాడని, అంతట ఫిర్యాది బంధువలతోటి అన్ని చోట్ల తిరిగి వెతకగా ఎక్కడే కాని కనపడలేదు అని శని వారం చాపాడు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పిర్యాదు ఇవ్వడమైనదని తప్పిపోయిన గౌతం నలుపు రంగు టీషర్టు, షార్ట్ ధరించి ఉన్నాడని ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ఆచూకీ లభించిన వారు చాపాడు ఎస్ఐ 9121100601, మైదుకూరు రూరల్ సిఐ 9121100621 నెంబర్లకు తెలపవలసినదిగా కోరారు.

## ఘనంగా డా॥శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు



పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్ : పోరుమామిళ్ల మండల బిజెపి అధ్యక్షుడు నారిసెట్టి నాగేంద్ర ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా బద్వేల్ నియోజకవర్గ భాజపా ఇంచార్జ్ బొజ్జ రోషన్న మరియు నారిశెట్టి నాగేంద్ర చేతుల మీదుగా పోరుమామిళ్లలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేయడం జరిగింది. అలాగే ఆస్పత్రి ఆవరణంలో ప్రహరీ గోడ పొడవునా మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో బద్వేల్ కో కన్వీనర్ పాలెం శెట్టి పండరి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓబిసి మోర్చా నారోజు రమణాచారి, పోరుమామిళ్ల బిజెపి మండల జనరల్ సెక్రటరీ వంకదారి జయరాం, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు రవీంద్ర, మండల ఉపాధ్యక్షులు గురయ్య, టిడిపి నాయకులు తిరుమల శెట్టి సుబ్బారావు, పోరుమామిళ్ల టిడిపి పట్టణ మండల అధ్యక్షుడు మస్తాన్, రంగసముద్రం పంచాయతీఎంపిటిసి కల్వకూరి రమణ, పాపయ్య, సోమిరెడ్డి, అతికారి రాజా తదితరులు పాల్గొన్నారు.

## జగ్జీవన్ రామ్ సేవలు మరువలేనివి



నందలూరు మేజర్‌న్యూస్: భారత దేశ తొలి ఉప ప్రధాని స్వాతంత్ర సమరయోధుడు బాబు జగ్జీవన్ రామ్ సేవలు మరువలేనివని నందలూరు మండల సర్పంచ్ సంఘం అధ్యక్షులు నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. శనివారం నాగిరెడ్డిపల్లి రోడ్లు భవనాల అతిథి గృహం సమీపంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులులు అర్పించారు. బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివి అన్నారు. స్వాతంత్ర పోరాటంలో ఆయన పాత్ర ఎంతో గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో భీమా మునిస్వామి షేక్ మౌలా తుమ్మది శివశంకర్ హెచ్ది ప్రసాద్ శంకర సుబ్బరాయుడు గంగయ్య ఫిట్టర్ సుబ్బరాయుడు రామాంజి నాగరాజు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## జూనోసిస్ డే పై అవగాహన కార్యక్రమాలు



వాల్మీకిపురం, మేజర్‌న్యూస్ : వాల్మీకిపురం మండలం లోని చింతపర్తి ప్రాధమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని తాటిగుంట పల్లి, చింతపర్తిలో జూనోసిస్ (జంతువుల ద్వారా మనుష్యులుకు వ్యాప్తి చెందే వ్యాధులు) పై ప్రజలకు పి.హెచ్.సి నందు 104 సేవలలో భాగంగా అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డాక్టర్ జులేఖ బేగం మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం జులై 6వ తేదీ ని ప్రపంచ జూనోసిస్ డే గా నిర్వహించుకుంటున్నాము. 1885 సం లో లూయి పాశ్చర్ అను శాస్త్రవేత్త రేబిస్ వ్యాధి తో ఉన్న బాలునికి విజయవంతంగా టీకాను వేసి అతన్ని కాపాడటం జరిగింది. అందువల్ల ప్రతీ సంవత్సరం జులై 6న జూనోసిస్ డే జరుపుకుంటున్నాము. ముఖ్యంగా ఈరోజు జంతువుల నుండి మానవులకు వ్యాప్తి చెందు వైరస్ వ్యాధులు ర్యాబిస్, స్వైన్ ఫ్లూ, బర్డ్ ఫ్లూ, మెనింజైటిస్, ఇన్ఫ్లుఎంజా మరియు బ్యాక్టీరియా వ్యాధులు ఆంథ్రక్స్, బోవైన్ టి.బి, సల్మోనెల్లూసిస్, బ్రుసెల్లోసిస్, లెప్టోస్పిరోసిస్, మరియు పారసైటిక్ వ్యాధులు టీనియాసిస్, స్కేబిస్, ఆస్కారిస్, హైడ్రాటిడోసిస్, అమీబియాసిస్, సర్కోసిస్టసిస్ మొదలైనవి దాదాపు 280 రకాలు ప్రపంచ ఆరోగ్య సంస్థ చే గుర్తించబడ్డాయి. నివారణ మరియు నియంత్రణ చర్యల్లో భాగంగా మనము పెంపుడు జంతువులకు సకాలంలో పశువుల ఆస్పత్రిలో టీకాలు వేయించాలి. నట్టల నివారణకు మందులు వేయించాలి. పశువుల కొట్టాల దగ్గర పారిశుద్యత పాటించాలి. నీటి నిల్వలు లేకుండా చూడాలి. పాల ఉత్పత్తి దారులు, వ్యవసాయ రైతులు, గొర్రెల కాపరులు, కుక్కలను ఇంటిలో పెంచుకునే వారు, జంతు ప్రదర్శన శాలలో పనిచేయు వారు, కసాయి పని చేయువారు, కోళ్ల పరిశ్రమలో పని చేయు వారు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. మరియు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. అనంతరం ర్యాలీ నిర్వహించారు, చింతపర్తి పశువుల ఆస్పత్రిలో 14 కుక్కలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్.ఓ. ఇందిర, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, ఆరోగ్య పర్యవేక్షకులు సుధాకర్, భానుభి, ఎమ్.ఎల్.హెచ్.పి. పుష్ప, రమ్య, ఏ.ఎన్.ఎమ్. రెడ్డెమ్మ, ఆశాకార్యకర్తలు, మూరేవాండ్లపల్లి వెటర్నరీ అసిస్టెంట్ మహేష్, చింతపర్తి వెటర్నరీ డాక్టర్ అనూష, అసిస్టెంట్ విజయ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నూతన కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను సన్మానించిన సలావుద్దీన్



కడప కలెక్టరేట్ మేజర్ న్యూస్: నూతన కలెక్టర్‌గా శనివారం బాధ్యతలు చేపట్టిన లోతేటి శివశంకర్ ను ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివశంకర్ కడపలో సలావుద్దీన్ చేస్తున్న సామాజిక కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు భవిష్యత్తులో పేదలకు సహాయం చేసేందుకు అండగా ఉంటానని పేర్కొన్నారు ఈ సందర్భంగా సయ్యద్ సలావుద్దీన్ మాట్లాడుతూ కడప జిల్లా కలెక్టర్ లు గా పనిచేసిన ఎంతోమంది మంచి పేరు సంపాదించుకొని వెళ్లారని మీరు కూడా కడప జిల్లా ప్రజలకు అండగా ఉండి అభివృద్ధి పథంలో జిల్లాను ముందుకు తీసుకుని వెళ్లాలని కోరారు కడప నియోజవర్గంలో అత్యధిక సంఖ్యలో ముస్లిం జనాభా ఉందని అందుకు అనుగుణంగా కడప నగరంలో అభివృద్ధి ముందుకు తీసుకెళ్లాలని కోరారు ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ జిల్లాను రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్తా మని చెప్పారు ఇందులో ఆయన వెంట పలువురు పాల్గొన్నారు.

## నూతన కలెక్టర్‌ను మర్యాదపూర్వక కలయిక పైడిపల్లి కిషోర్



పులివెందుల అర్బన్, మేజర్ న్యూస్ : కడప కలెక్టరేట్ నందు నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శివశంకర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన డిస్టిక్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ మరియు ఎస్పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పైడిపల్లి కిషోర్ ఎస్పీఎఫ్ కన్వీనర్ ముత్తన సుధాకర్ బాబు పాల్గొనడం అయినది కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎఫ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ప్రఖ్యాత కళాశాలల జాబితాలో మిట్స్ కళాశాలకు చోటు



మదనపల్లె మేజర్‌న్యూస్: అన్నమయ్య జిల్లా,మదనపల్లె పట్టణం సమీపంలో గల మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మిట్స్ కళాశాల) ప్రపంచ స్థాయిలో ప్రఖ్యాత కళాశాలల జాబితాలో స్థానం సంపాదించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ పేర్కొన్నారు.ఎస్.సి.ఐ మాగో ఇన్స్టిట్యూషన్స్ ర్యాంకింగ్‌లు (సార్)లలో ఈ ఘనత సాధించినట్లు ఆయన అన్నారు.ప్రపంచ స్థాయిలో నాణ్యమైన జర్నల్‌లు అండ్ పేటెంట్ల ఆధారంగా 2024 సంవత్సరానికి విద్య, పరిశోధనా సంస్థలకు ర్యాంకింగ్‌లను ప్రకటించింది. రీసెర్చ్ ల్యాబ్‌లు,ఐఐటిలు మరియు ఎన్ఐటిలతో సహా ప్రఖ్యాత ఇన్స్టిట్యూట్‌ల జాబితాలో మిట్స్ కళాశాలకు స్థానం లభించిందని ఆయన అన్నారు. ప్రపంచ స్థాయిలో కంప్యూటర్ సైన్స్ విభాగములో 3573 స్థానంను, ఎనర్జి విభాగము 1165 స్థానం, ఇంజనీరింగ్ విభాగములో 3688 స్థానం, గణిత విభాగములో 1880 స్థానము, ఫిజిక్స్ అండ్ ఆస్ట్రానమీలో 2160 స్థానం లభించిందని ఆయన అన్నారు.ఆంధ్రప్రదేశ్ నుంచి కేవలం 6 కళాశాలలు ఉండగా అందులో మిట్స్ కళాశాల ఒకటని ఆయన అన్నారు.ప్రపంచ స్థాయిలో ప్రఖ్యాత గాంచిన మిట్స్ కలశాల ఘనతకు ప్రోత్సహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్,ఆర్ అండ్ డి అడ్వైసర్ డాక్టర్ తులసిరామ్ నాయుడుకు అసోసియేట్ డీన్ ఆర్ అండ్ డి డాక్టర్ శివయ్య,అధ్యాపకులకు మరియు విద్యార్థులకు కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్లకు అభినందనలు తెలియజేశారు.

## డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమం

### అమ్మ జ్ఞాపకార్థం కోసం ఒక చెట్టు నాటి కార్యక్రమం



పులివెందుల మేజర్‌న్యూస్: డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా శనివారం పులివెందుల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు అమ్మ జ్ఞాపకార్థం కోసం ఒక చెట్టు నాటి కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ నందు చెట్లు నాటే కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సి ఐ మద్దిలేటి బిజెపి కడప జిల్లా అధ్యక్షులు. వంగల శశిభూషణ రెడ్డి . పులివెందుల అసెంబ్లీ కన్వీనర్ తేరా మహేశ్వర్ రెడ్డి రాష్ట్ర సాంస్కృత విభాగ కన్వీనర్ భాను ప్రకాష్ . బిజెపి కడపజిల్లా అధ్యక్షులు ఎస్సీ మోర్చా కోడుమూర్తి శ్రీరాములు. మండల అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి వాజ్ పాయ్. రామాంజనేయులు. కుళ్లాయప్ప. తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా బాబూ జగజ్జీవన్ రావు వర్థంతి



కడప ఎర్రముక్కపల్లె మేజర్ న్యూస్: నగరంలోని బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ ఉప ప్రధాని బాబు జగజీవన్ రావు వర్ధంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర సంఘం ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షుడు కైపు రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు వై వీరయ్య, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎం ప్రవీణ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు పి మనోహర్ లు ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ జగజ్జీవన్ రావు చిరస్మరణీయుడని కొనియాడారు ఆయన స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని హితవు పలికారు దేశానికి ఎంతో సేవ చేసిన గొప్ప వ్యక్తి అని చెప్పారు.

## ఎమ్మెల్యే సహకారంతో వార్డు అభివృద్ధికి చర్యలు

### టిడిపి నాయకులు నాగూర్ వలి వెల్లడి



మదనపల్లె, మేజర్‌న్యూస్ : ఎమ్మెల్యే షాజహాన్ బాషా సహకారంతో పట్టణంలోని 14వ వార్డు అభివృద్ధికి చర్యలు చేపట్టామని,అందులో భాగంగా ప్రజలకు మంచినీరు సవ్యంగా అందేలా పైపులైను ఏర్పాటు చేయడం జరిగిందని టిడిపి నాయకులు నాగూర్ వలి పేర్కొన్నారు.రెండో రోజులుగా వార్డులో తన పర్యవేక్షణలో పైపులైన్ ను సరైన రీతిలో పునరుద్ధరించారు.దీంతో నాగూర్ వలిపై స్థానిక ప్రజలు ప్రశంసల వర్షం కురిపించారు.ఈ సందర్భంగా నాగూర్ వలి మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు తమకు ఇష్టానుసారం పైపులైను వేసుకోవడం ద్వారా స్థానిక ప్రజలు మంచినీరు సకాలంలో అందక ఇబ్బంది పడేవారన్నారు.మదనపల్లి ఎమ్మెల్యేగా షాజహాన్ బాషా విజయం సాధించిన అనంతరం ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు.ఆయన వెంటనే మున్సిపల్ అధికారులకు సదరు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారన్నారు. దీంతో మున్సిపల్ అధికారులతో కలిసి ఎత్తు ప్రదేశం నుండి వార్డులోకి నీళ్లు వచ్చేవిధంగా పైపులైన్లను ఏర్పాటు చేశామన్నారు.కూటమి ప్రభుత్వంలో ప్రజలు,ప్రజాప్రతినిధులు వేరు కాదని,ప్రజలకు మంచి చేయడానికే తొలి ప్రాధాన్యతనిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఎమ్మెల్యే షాజహాన్ బాషా నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం పరితపించే నాయకుడని,అటువంటి వ్యక్తి ఎమ్మెల్యేగా ఉండడం ప్రజల అదృష్టమని కొనియాడారు.నియోజకవర్గ ప్రజలకు ఏ సమస్య వచ్చినా సత్వరమే పరిష్కరించడం ఆయన సమర్ధ పాలనకు నిదర్శనమన్నారు.ఆయన నేతృత్వంలో మదనపల్లి నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధిపథంలో పయనిస్తుందని స్పష్టం చేశారు.

## పెంపుడు కుక్కలకు ఉచితంగా రాబిస్ నిరోధక టీకాలు డాక్టర్ జయప్రకాష్



వీరబల్లి, మేజర్‌న్యూస్ : పెంపుడు కుక్కలు కరిస్తే వాటి వల్ల మనుషులకు ఏమి కాకుండా ఉండేందుకు వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని విఎల్‌వో డాక్టర్ జయప్రకాష్ తెలిపారు శనివారం అంతర్జాతీయ జూనోసెస్ డే సందర్భంగా మండలంలోని మట్లి పంచాయతీలో నీ పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ ఇచ్చారు ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై ఆరవ తేదీన జూనోసిస్ డేని జరుపుకుంటామని తెలిపారు. వివిధ రకాల వైరస్ల వల్ల సంక్రమిస్తున్న వ్యాధులను ఆంగ్లములో జూనోసిస్ అని అంటారని తెలిపారు. జూనోసిస్ అనేది అంటు వ్యాధులు వైరస్ బ్యాక్టీరియా మరియు పరాన్న జీవి ఇది జంతువుల నుండి మానవులకు జంతువులతో ప్రత్యక్ష లేదా పరోక్ష తాకిడి వల్ల ఆహారముల ద్వారా వ్యాప్తి చెందుతాయని తెలిపారు. జులై 06, 1885 లో లూయిస్ పాశ్చర్ జెనెటిక్ వ్యాధి అయిన రాబిట్ వైరస్ కు మొదటి వాక్సిన్ విజయవంతంగా ఇచ్చిన రోజు కావున ప్రపంచవ్యాప్తంగా జులై 6 ను జూనోసిస్ డే గా జరుపుకుంటారని తెలిపారు. ఆధునిక సమాజంలో ప్రతి ఇంటిలో దాదాపు పెంపుడు జంతువులు కనిపిస్తున్నాయన్నారు అయితే పెంపుడు జంతువులలో ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే అది మన ప్రాణాలకు ముప్పు తప్పదని పశు వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారన్నారు పెంపుడు జంతువుల నుండి మనుషులకు వ్యాధులు సంక్రమించకుండా అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా జూలై ఆరో తేదీన ప్రపంచ జూనోసిస్ డే గా నిర్వహిస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో పెంపుడు జంతువులైన కుక్కలకు ప్రతి ఆరు మాసాలకు ఒకసారి తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మట్టి గ్రామ పంచాయతీలోని మట్లి ఎల్లంపల్లిలో అలాగే చందన వ్యాలీలోని పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ ఇచ్చారు.

## పెంపుడు కుక్కలకు రాబిస్ నిరోధక టీకాలు

మైదుకూరు, మేజర్‌న్యూస్ : ప్రపంచ జంతు సంక్రమిత వ్యాధుల దినోత్సవం సందర్భంగా శనివారం మైదుకూరు ప్రాంతీయ పశువైద్యశాల నందు ఉచితంగా పెంపుడు కుక్కలకు యాంటటి రేమిడీస్ టీకాలు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జోనాటిక్ వ్యాధుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి. గురివిరెడ్డి, నంద్యాలంపేట పశువైద్యాధికారి పి. సుధాకర్, ఒనిపెంట పశువైద్యాధికారి జె. మౌనిక, ఎల్.ఎస్.ఎ. ఆర్.ఎస్.కె. పశు సంవర్ధక సహాయకులు, కార్యాలయ సిబ్బంది డి. చంద్ర, సురేష్‌లు పాల్గొన్నారు.

## పులివెందులలో రాజరిక పాలన కొనసాగిస్తున్న ఈఓఆర్‌డి

### ఆర్డీవోకు ఆమెపై ఫిర్యాదు



పులివెందుల మేజర్ న్యూస్ : పులివెందుల మండల ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఈ ఓ ఆర్ డి విజయభాను రాచరిక పపాలను కొనసాగిస్తుందని టిడిపి యువ నాయకుడు మల్లికార్జున యాదవ్ అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఓ ఆర్ డి పనిచేస్తున్న విజయ భాను కలిసేందుకు కార్యాలయానికి వెళ్తే వచ్చిన వారు ఎవరైనా సరే ఆమె ముందర నిలబడే సమస్యలను చెప్పుకోవాల్సిన పరిస్థితి నెలకొనిందని ఆయన మండిపడ్డారు. కార్యాలయానికి ప్రజలు ఎవరు వెళ్లిన ఆమె ముందు కూర్చోవద్దునీ,నిల్చోనే మీ సమస్యలు ఏవైనా సరే మాట్లాడి వెళ్లాల్సిందే అని అనడం చాలా బాధాకరమన్నారు. ఇంకా మనము రాజరికపాలలోనే ఉన్నామనే భావనలో ప్రజలు అయోమయ పరిస్థితిలో ఉన్నారన్నారు. ఇది ప్రజలకు సంబంధించిన కార్యాలయమాలేక అధికారుల సొంత భవనాల సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. నాయకులకే పలుకని ఇలాంటి అధికారులు సాదాసీదా ప్రజలకు ఏం పలుకుతారో ఈమెను చూస్తే అర్థమవుతుందని ఆయన అన్నారు. ఆమె శైలి పై ఆర్డీవో కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఆర్డిఓ చర్యలు తీసుకోకపోతే. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం అని ఆయన హెచ్చరించారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఈదుల




రాజుపాళెం,మేజర్‌న్యూస్: కడప జిల్లా నూతన కలెక్టర్‌గా శనివారం బాధ్యతలు చేపట్టిన లోతటి శివ శంకర్‌ను టిడిపి కడప పార్లమెంటు కార్యనిర్వక కార్యదర్శి ఈదుల జగన్ మోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు జిల్లాలో ఎక్కువగా రైతులు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని వారి సంక్షేమం అభివృద్ధి కోసం తోడ్పాటు అందించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ ప్రాంత రైతు సమస్యలపై ప్రొద్దుటూరు శాసనసభ్యులు నంద్యాల వరదరాజులరెడ్డి ద్వారా జిల్లా కలెక్టర్లకు సమస్యలు వివరిస్తామన్నారు ప్రజలు, రైతుల అభివృద్ధిని ఆకాంక్షించే ఉత్సాహవంతుడు యువ కలెక్టర్ ను జిల్లాకు నియమించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రొవిజినల్ స్టోర్ లో సరుకులు కొట్టేసిన కిలాడి లేడీ



మదనపల్లె క్రైమ్, మేజర్‌న్యూస్ : ప్రొవిజినల్ స్టోర్లో సరుకులు కొట్టేసిన కిలాడి లేడి ఉదంతం శనివారం మదనపల్లెలో వెలుగు చూసింది. మధ్యాహ్నం 3:20 గంటలకు సుమారు 25ఏళ్ళ వయసున్న కిలాడీ లేడి స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లోని ఓ ప్రొవిజినల్ స్టోర్‌కు వెళ్ళింది. ఐదు వేలకు సరుకులు కొను క్కొంది. ఓఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అమౌంట్ ప్రాసెసింగ్ ఉండగా షాప్ నుంచి చెప్పకుండా వెళ్ళిపోయింది. సి.సి.కెమెరా ఫుటేజ్ పరిశీలించిన యజమాని, మోసం చేసిందని వన్ టౌన్‌లో ఫిర్యాదు చేశారు.

## నూతన జిల్లా కలెక్టర్‌కు వినతి అందచేసిన గంజికుంట నాగరాజు




ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్: కడప జిల్లా అభివృద్ధి వేదిక కన్వీనర్ గంజికుంట నాగరాజు ఆధ్వర్యంలో నూతన జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శివశంకర్ లోతేటిని కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఇచ్చారు. స్పందించిన జిల్లా కలెక్టర్ కడప జిల్లా ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకై అలాగే చెన్నూరు చక్కెర పరిశ్రమ, ప్రొద్దుటూరులో పాలకేంద్రం తిరిగి ప్రారంభించుటకు సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు . నిరుద్యోగ యువతకు జిల్లాలో తగిన ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అందుకు మా వంతు సహకారం కచ్చితంగా చేస్తామని హామీ ఇచ్చారు.

## పులివెందుల చేరుకున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్

### దారి పొడుగునా ప్రజల అభివాదాలు
### జగన్‌తోసెల్ఫీలు దిగిన స్కూల్ పిల్లలు

పులివెందుల అర్బన్, మేజర్‌న్యూస్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా కడప నుండి వేంపల్లి మీదుగా పులివెందుల సాయంకాలం 6 గంటలకు పులివెందుల చేరుకున్నాడు. దారి పొడవున ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు,స్వాగతం పలికారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. వేంపల్లి చేరుకోగా వేంపల్లి వద్ద భారీ జనాలు ఆయన కాన్వాయని ఆపి వారికి అభివాదం చేశారు. అక్కడనుండి వేమల మీదుగా పులివెందులకు వస్తుండగా వేములలో నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. దుర్గన్న గారి పల్లె సమీపంలో ఉన్న సెవెంత్ డే స్కూల్ విద్యార్థులు జగన్మోహన్ రెడ్డితో సెల్ఫీలు తీసుకొని జగన్ మామయ్య అంటూ ఆప్యాయంగా పిలిచారు. అక్కడనుండి పులివెందుల అక్కడనుండి పులివెందుల చేరుకున్న జగన్మోహన్ రెడ్డిని పులివెందుల నియోజకవర్గం లోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, జై జగన్ అంటూ నినాదాలు జగన్మోహన్ రెడ్డికి స్వాగతం పలికారు. జగన్మోహన్ రెడ్డి ఆరు గంటలకు క్యాంపు కార్యాలయం చేరుకున్నారు. క్యాంపు కార్యాలయంలో వచ్చిన నాయకులతో ప్రజలతో నాయకులతో ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఎవరు అధైర్య పడవద్దని అండగా ఉంటామన్నారు. ఆయనతోపాటు ఎంపీ అవినాష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## 10 నుండి శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి తిరుణాల

సుండుపల్లి, మేజర్‌న్యూస్:సుండుపల్లె మండల పరిధిలోని ముడుంపాడు పంచాయతీ పింఛా ప్రాజెక్టు, సమీపంలో వెలసిఉన్న శ్రీ ప్రసన్న ఆజనేయస్వామి తిరణాల మహోత్సవం 10 వ తేది ఉదయం 7 గంటలకు మహా గణపతి పూజ, స్వస్తినాచనము,కలశస్థాపన, అభిషేకము, ఆకుపూజ, అర్చన, నైవేద్యం, తీర్థప్రసాదాలు స్వామివారికి అర్చన మహామంగళహారతి,11 వ తేది గురువారం ఉదయం 8 గంటలకు స్వామివారికి రుద్రాభిషేకము, ఆకు పూజ, అర్చన,నైవేద్యము, తీర్థప్రసాదాలు,12 వ తేది శుక్రవారం ఉదయం 8 గంటలకు స్వామివారి రుద్రాభిషేకము, ఆకుపూజ,అర్చన,నైవేద్యం, తీర్థప్రసాదాలు మధ్యాహ్నం : 4.30 నుండి 6:00 గంటల వరకు శుభ ధనుర్లగ్నమందు శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవము అంరగంగ వైభవముగా నిర్వహిస్తామన్నారు. కందల వీరాంజనేయులు, సుప్రజ,కుటుంబ సభ్యులు అన్నదానం. రాత్రి 8 గంటలకు సానవలచిన్నమ్మ కథ, మేళతాళాతో, బాణసంచాలతో, విద్యుత్ దీపాలంకరణలతో అత్యంత వైభవంగా చాందిని బండ్లు కట్టి మొక్కలు తీర్చుకుంటారు.

## బత్యాలకు శుభాకాంక్షలు తెలిపిన బలిజ సేన



పుల్లంపేట, మేజర్‌న్యూస్ : మాజీ ఎమ్మెల్సీ, టిడిపి ప్రధాన కార్యదర్శి భత్యాల చెంగల్ రాయులకు పుల్లంపేట బలిజ సేన అధ్యక్షులు పి.వెంకట సుబ్బయ్య ఉపాధ్యక్షులు ఎస్, సుబ్రమణ్యం (చిన్న)లు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం జన్మదినం జరుపుకుంటూ ఉన్న బత్యాలను కలిసి వారు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలిజ సేన తరపున ప్రజల మనిషిగా పేరు పొందిన భత్యాలకు శుభాకాంక్షలు తెలియజేశామని, భవిష్యత్తులో ఇలాంటి నాయకుని సలహాలు సూచనలతో బలిజ సేన ను మరింత ముందుకు తీసుకువెళ్తామని, అలాగే అందరి సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలియజేశారు.

## విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చేయడం తగదు

### పిడియస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న

మైదుకూరు, మేజర్‌న్యూస్ : మైదుకూరు నియోజకవర్గం ఖాజీపేట మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ బాలికలకు కలుషిత నీరు,ఉడకని మధ్యాహ్న భోజనం తినడంతో విద్యార్థినీలు అస్వస్థతకు గురయ్యారని గత వారం రోజుల నుండి చికిత్స పొందుతున్న ఒక్క విద్యాశాఖ అధికారి కూడా వెళ్లి విద్యార్థుల వాళ్ళ తల్లిదండ్రులను పరామర్శించిన పాపాన పోలేదుని ప్రజాప్రతినిధులు స్పందించి రిమ్స్ నుండి ఇతర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కు మెరుగైన వైద్యం కోసం తక్షణమే విద్యార్థినీలను తరలించాలని పిడియస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న,జిల్లా కార్యదర్శి జి శ్రీనాథ్ యాదవ్ డిమాండ్ చేశారు . శనివారం నాడు పిడియస్ యు రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఖాజీపేటలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో మొదట 15 మంది విద్యార్థినీలు చేరారని రోజురోజుకు ప్రస్తుతం 40 పైగా విద్యార్థినీలు మరికొందరు ఏకంగా మూడు నుంచి నాలుగు వార్డులలో చేరడం జరిగిందని, ఈ ఘటన జరిగి వారం రోజులు కావస్తున్న జిల్లా విద్యాశాఖధికారులు కూడా జిల్లా సర్వజన ఆస్పత్రి రిమ్స్ కి వెళ్లి విద్యార్థినీలను పరామర్శించలేదన్నారు.రిమ్స్ లో సరిగ్గా వైద్యం చేయడం లేదని స్వయానా విద్యార్థినీలు మరియు వారి తల్లిదండ్రులు బంధువులు ఆరోపిస్తున్న అక్కడ ఉన్న డాక్టర్లు పట్టించుకోలేదుని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అదే విద్యాశాఖధికారులు మీ బిడ్డలకు ఇలా జరిగితే ప్రభుత్వ ఆసుపత్రిలో వారం రోజులు పాటు చికిత్స చేపిస్తారా అని ప్రశ్నించారు. కావున ఇప్పటికైనా ఏసీలో ఉన్న విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల పైన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నిత్యం ఎయిడెడ్ పోస్టులు వ్యవహారంలో ఓపెన్ పరీక్షలలో కోట్లాది రూపాయలు డబ్బులుకు దాసోహం అయ్యారన్నారు. అసలు వాళ్లు విధులకు హాజరవుతున్నారా లేదో తెలియడం లేదన్నారు. ప్రధానంగా కడప డిప్యూటీ డిఈఓ రాజగోపాల్ రెడ్డి విధులకు హాజరు కావడం లేదన్నారు.ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి విద్యార్థినీలకు మెరుగైన చికిత్స కోసం ఇతర మల్టీ స్పెషాలిటీ హాస్పిటలకు తరలించాలన్నారు. ఇప్పటికే రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి,ఆ ప్రాంతా నియోజకవర్గ శాసనసభ్యులు సుధాకర్ యాదవ్, కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి రెడ్డిలకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

## కోదండ రామాలయంలో నూతన కలెక్టర్



ఒంటిమిట్ట, మేజర్‌న్యూస్:ఏకశిలా నగరం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామ స్వామిని శనివారం ఉదయం కడప జిల్లా నూతన కలెక్టర్ శివశంకర్ దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు టిటిడి పరిరక్షణలో ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలకడం జరిగింది. భాజా భజంత్రీలతో ఆలయప్రదక్షిణ గావిస్తూ అంతరాలయంలోకి ప్రవేశించడం జరిగింది. ఆయన గోత్రన ామాలతో శ్రీ కోదండ రామస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయడం జరిగింది. శనివారం కావడం చేత శ్రీ సీతారామ లక్ష్మణ మూలవర్లకు అర్చకులు పాంచ రాత్ర ఆగమం ప్రకారం వైష్ణ సంప్రదాయ పద్ధతిలో పంచామృత అభిషేకాలు నిర్వహించి దేదీప్యమానంగా అలంకరించి ఆలయానికి వచ్చిన భక్తులకు స్వామివారి దర్శనం భాగ్యాలు కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయమంతా రామనామ సంకీర్త నలతో మార్మోగింది.

## జగన్‌కు అడుగడుగునా జననీరాజనాలు



వేంపల్లె, మేజర్‌న్యూస్: మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి వేంపల్లెలో అడుగడుగునా ప్రజలు జననీరాజనాలు పలికారు. మూడు రోజులపాటు జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఆయన వేంపల్లె బైపాస్ రోడ్డు మార్గాన పులి వెందులకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో హనుమాన్ జంక్షన్ వద్ద వైఎస్ ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ కరచాలాలను అందించారు. దీంతో నాయకులు కార్యకర్తలు, అభిమానులు యువత కేరింతల కొడుతూ సంతోషం వ్యక్తం చేశారు. అలాగే బైపాస్ లోని ఫ్యామిలీ రెస్టారెంట్ వద్ద, రాజీవ్ కాలనీ వద్ద పెద్ద ఎత్తున కార్యకర్తలు నాయకులు అభిమానులు హాజరై స్వాగతం పలికారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందరికీ అభివాదం చేస్తూ ఎవరు అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని భరోసాన్ని నింపారు. అనంతరం పులివెందులకు రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లారు. మూడు రోజులపాటు పులివెందుల లోని వైఎస్ఆర్సిపి కార్యాలయంలో నాయకులు కార్యకర్తలతో సమావేశం కానున్నట్లు సమాచారం.

# 53ఎర్రచందనం దుంగలు స్వాధీనం

మొదటిపేజీ తరువాయి

దుంగలు కనిపించాయి. వీటిని స్వాధీనం చేసుకుని ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో కడప జిల్లా ఖాజీపేట మండలానికి చెందిన దాడిబోయిన గురుప్రసాద్ (37), మైదుకూరు మండలంకు చెందిన తమ్మిశెట్టి వెంకటేష్ (24), బత్తల శివ (25)లుగా గుర్తించారు. పారిపోయిన మరో ముగ్గురు కోసం గాలింపులు చేపట్టారు. అరెస్టయిన వారిని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎర్రచందనం దుంగల విలువ సుమారు రూ. 20లక్షల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు.

## హత్యాయత్నం కేసులో నిందితులు అరెస్టు

### సీఐ చాంద్ బాషా



వేంపల్లె మేజర్ న్యూస్: శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి అనుచరుడు వేంపల్లె అజయ్ కుమార్ రెడ్డిపై శుక్రవారం సాయంత్రం దాడి చేయడం అందరికీ తెలిసిందే. అజయ్ కుమార్ రెడ్డి సోదరుడు మౌనిధర్ రెడ్డి ఫిర్యాదు మేరకు 10 మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌసల్ ఆదేశాలు, పులివెందుల డిఎస్పీ వినోద్ కుమార్ సూచనల మేరకు నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు వేంపల్లె సీఐ చాంద్ బాషా విలేకరులతో వెల్లడించారు. శనివారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో పులివెందుల పట్టణ శివారులోని శిల్పారామం వద్ద నిందితులు సింహాద్రిపురం పట్టణానికి చెందిన గండూరు హిదాయతుల్లా, కొండాపురం మండలం, డోంకుపల్లి గ్రామానికి చెందిన పందిర్ల శివకుమార్ రెడ్డి, సింహాద్రిపురం మండలం, కొరగుంటపల్లి గ్రామానికి చెందిన మల్లెల మహేశ్వర, వేముల మండలం, నల్లచెరువుపల్లి గ్రామానికి చెందిన రామిరెడ్డి ధరణీశ్వర రెడ్డి లను పట్టుకున్నట్లు వివరించారు. మిగిలిన నిందితులను త్వరలో పట్టుకుని అరెస్టు చేస్తామని తెలిపారు. వేంపల్లె టిడిపి మండల పరిశీలకుడు అజ్జుగట్టు రఘునాథ్ రెడ్డి, అజ్జుగట్టు రవితేజరెడ్డిలను అసభ్య పదజాలంతో తిట్టడంతో పాటు సోషల్ మీడియాలో అవహేళన చేశారనే నెపంతో అజయ్ కుమార్ రెడ్డిని చంపాలని శుక్రవారం పులివెందుల రోడ్డులోని సతీష్ రెడ్డి స్కూల్ సమీపంలో హాకీ స్టిక్స్, బండరాళ్లతో కొట్టి గాయపరిచామని నిందితులు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు.

## మిల్లర్లు, వ్యాపారస్తులు సామాజిక బాధ్యతగా వహించాలి : జాయింట్ కలెక్టర్



రాయచోటి, మేజర్‌న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ శనివారం కలెక్టరు ఆఫీసు నందు గల సమావేశ మందిరంలో జిల్లాలోని రైస్ మిల్లర్లు, టోకు వర్తకులు, పప్పు ధాన్యముల టోకు వర్తకులతో సమావేశం నిర్వహించినారు. ఈ సమావేశములో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరము కంటే ప్రస్తుతము సంవత్సరం బియ్యం, కంది పప్పు ధరలు పెరిగినవని కావున మిల్లర్లు, వ్యాపారస్తులు సామాజిక బాధ్యతగా భావించి బియ్యం మరియు కంది పప్పు ధరలు తగ్గించి ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచమని ఆదేశించినారు. కంది పప్పు కిలో రు.162/- చొప్పున మనిషికి గరిష్టంగా కిలో, ఆర్ఎన్ఆర్ రకం పచ్చి బియ్యం కిలో రు.52/- చొప్పున ప్రతి వ్యక్తికి గరిష్టంగా 5 కిలోలు ప్రత్యేక కౌంటర్ల ద్వారా పంపిణీకి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మరియు కందిపప్పు విషయములో ప్రభుత్వం నిర్దేశించిన స్టాక్ పరిమితులకు మించి నిల్వలు కలిగియున్నచొ కఠినచర్యలు తీసుకోనబడునని హెచ్చరించారు. ఈ సమావేశం నందు జిల్లా పౌర సరఫరాల అధికారి, సహాయ సంచాలకులు , మార్కెటింగ్ , జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ, సహాయ సంచాలకులు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ పుట్టినరజు వేడుకలు



ఓబులవారిపల్లి మేజర్ న్యూస్ : సాద్ ముఖర్జీ 1951లో భారతీయ జన సంఘ్ పార్టీ స్థాపించి దేశంలో తొలి హిందూవాద రాజకీయ పార్టీని స్థాపించిన నేతగా స్థానం పొందినారు అని జై భారత్ రెడ్డి శ్యాంప్రసాద్ ముఖర్జీ గొప్పతనాన్ని తెలియజేసి ఆయనని స్మరించుకొంటూ ఫోటోకి పాలాభిషేకం, కేక్-కట్,పులమాలతో మరియు బాణసంచలతో పండుగలా జరుపుకున్నారు. ఈ సందర్భంగ వివిధప్రాంతాల నుంచి సీనియర్ నాయకులు సుబ్బారావు రాయుడు, యువజన-నాయకులు ప్రశాంత్ రెడ్డి,మొరలి,సాయి కుమార్, బాబ్జీ,గంగాధర్,నరశిమా మరియు మాధవ్‌తో కలసి పలువరు యువ నాయకులు తరలివచ్చి మంగంపేటలో సంబరాలు చేసుకున్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

### అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్



పులివెందుల అర్బన్, మేజర్‌న్యూస్ : ఎరువుల దుకాణాల యజమానులు, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్, సీఐ భాషలు అన్నారు. శనివారం కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని ఎరువుల దుకాణాలను ప్రత్యేక టీములు తనిఖీ నిర్వహించారు .ఈ సందర్భంగా ఎరువుల దుకాణాల్లోని విత్తనాలను,ఎరువులను, పురుగుల మందులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాలలోని రిజిస్టర్ లను తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ అనుమతి లేని పురుగుల మందులను విక్రయించరాదని దుకాణ యజమానులకు సూచించారు అలాగే 2, 52, 486 రూపాయల మందులను విక్రయించరాదని నోటీసులను అందజేశారు. రైతులకు నకిలీ విత్తనాలను విక్రయించరాదని విత్తనాలను వికరించేటప్పుడు బిల్లులను కచ్చితంగా ఇవ్వాలని సూచించారు .ఈ కార్యక్రమంలో డిఏఓ కార్యాలయ వ్యవసాయ అధికారి గోవర్ధన్,పులివెందుల మండల వ్యవసాయ అధికారి నాగలక్ష్మి, టెక్నికల్ ఏవో సునీల్ కుమార్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య www.SURYAA.com

గత 17 సంవత్సరాల నుంచి దిగ్విజంగా నడుపబడుతన్న

సూర్య దినపత్రికకు విలేకరులు కావలెను

కడప జిల్లా - కలెక్టరేట్, ఎర్రముక్కపల్లి, రిమ్స్, దువ్వూరు, ప్రొద్దుటూరు రూరల్, ప్రొద్దుటూరు క్రైం, వి.ఎన్.పల్లి, ముద్దనూరు, కొండాపురం, దువ్వూరు, బద్వేలు రూరల్, బద్వేలు అర్బన్, గోపవరం, బి.కోడూరు.

సంప్రదించాల్సిన నెంబర్లు :
9177345622, 9491490468